క్లుప్తంగా

సంత్ రామ్‌రావు జయంతి

నవాబ్‌పేట: గిరిజనుల ఆరాధ్యాదైవం సంత్ రామ్‌రావు బాపూ జయంతి సోమవారం నిర్వహించారు. యన్మన్‌గండ్ల సేవాలాల్ గుట్టలో రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన నాయకుడు తులసీరాం నాయక్, లింభ్యానాయక్ రామ్‌రావు బాపూను కొనయాడారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి బోగ్ బండార్ నిర్వహించారు. కార్యక్రమాల్లో గిరిజన నాయకులు నర్సింహనాయక్, అంబాదాస్, గోపాల్, నరేందర్, రమేష్, బాబు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండిశఠగోపం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బండ్లగేరిలోని శ్రీరుక్మిణి పాండురంగస్వామి ఆలయానికి ఆషాఢశుద్ధ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా చికినే నరేశ్‌కుమార్ ఆలయానికి 250 గ్రాముల వెండితో తయారు చేసిన శఠగోపాన్ని సోమవారం సమర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సత్యమ్మ, శివజ్యోతి, అద్విత్, ప్రణయ, మాజీ కౌన్సిలర్ పద్మశాంతన్న, డాక్టర్ సత్యనారాయణ, బాలరాజు, వెంకటయ్య, ఆనంద్, గోపి పాల్గొన్నారు.

జీఓ ప్రతులు దహనం



జడ్చర్ల టౌన్: పనిగంటలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 282 ప్రతులను సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు దహనం చేశారు. కార్మికులపై భారం పడేలా చేస్తున్న జీఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మికులు నినదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెంకటేశ్, కృష్ణ, విద్యాసాగర్, కరీం, మొగులమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈవో కురుమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గౌరిదేవిపల్లి పాఠశాలలో సోమవారం మూసాపేట మండలం జానంపేటకు చెందిన బాలాజీ ఫైనాన్స్ చైర్మన్ భానుచందర్ స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలను ఎంఈఓతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేయించారు. బ్యాగులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేయించిన దాతను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, రాఘవ ఉన్నారు.

సేవతో ఆత్మశుద్ధి

హన్వాడ: సేవ హృదయాన్ని.. ఆత్మను శుద్ధి చేస్తుందని ఎంఈఓ గోపాల్‌నాయక్ అన్నారు. మండలంలోని యారోనిపల్లివాసి బీసు తిరుపతిరెడ్డి సోమవారం తాను చదువుకున్న పాఠశాల విద్యార్థుల కోసం రూ.50వేల విలువ చేసే డ్యూయల్ డెస్క్ బెంచీలు, నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సీల అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అబ్దుల్ సమద్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యంపై కేసు నమోదు

జడ్చర్ల: జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఇద్దరు యువతులు అదృశ్యమైనట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మున్సిపాలిటీలోని బూరెడ్డిపల్లిలోని బృందావన్ కాలనీకి చెందిన దీవెన(19) శంశాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తుంది. ఈ క్రమంలో ఆదివారం ఇంటినుంచి షాద్‌నగర్‌కు బస్సులో బయలు దేరింది. తిరిగి రాత్రికి ఇంటికి చేరాల్సి ఉండగా.. రాలేదు. ఫోన్‌నెంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులు, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేక తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గౌరీశంకర్ కాలనీకి చెందిన వనజ(18) కూడా సోమవా రం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నవాబ్‌పేట: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత కు అవగాహన ఉండాలని ఏఎస్ఐ జనార్దన్ సూచించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో ఏ ర్పాటు చేసిన పోలీసు కళాజాత కార్యక్రమంలో పా ల్గొని మాట్లాడారు. ప్రధానంగా విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడ పరాదన్నారు. మైనర్లకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులు కూడా ఈ చట్టం ఉల్లంఘనలో కి వస్తారని వివరించారు. ఫోన్లలో వచ్చే అనవసర మెసేజ్‌లకు స్పందిస్తే ఖాతాల్లో ఉన్న డబ్బులు ఖాళీ అవుతాయని, ప్రతి విషయానికి స్పందించకూడదన్నారు.

వికసించిన బ్రహ్మకమలం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వెంకటేశ్వరకాలనీలోని డాక్టర్ గంగాధర్‌గౌడ్, భారతీదేవి దంపతుల ఇంటి పెరట్లో ఆదివారం అర్ధరాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఏడాదికోసారి విరబూసే ఈ మొక్కను సుమారు 12ఏళ్ల క్రితం ముంబై నుంచి తెప్పించుకుని నాటారు. ఈసారి ఏకంగా నాలుగు పూలు వచ్చాయని వారు తెలిపారు.



బస్సులకు నో వే



బస్టాండ్ దగ్గర ఆటోల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు



బస్సుకు ఎదురుగా రాంగ్‌రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

- బస్టాండ్ వద్ద ఆటోలకు ప్రత్యేక దారి
- బస్సులు తిరిగేందుకు స్థలం లేక ఇక్కట్లు.. ఎదురెళ్తున్న బైకులు

పాలమూరు: జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యం అవుతున్నాయి. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రధాన రోడ్డుపై ప్రయాణికుల కోసం ఆటోలు రోడ్డుపై మధ్యలో నిలుపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం బస్టాండ్ ఎదుట రోడ్డుపై ఒకవైపు ఆటోల కోసం కొంతమార్గం వదిలేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే మరోవైపు నుంచి బస్టాండ్‌లో నుంచి బస్సులు బయటకు వచ్చే మార్గం వరకు వాటిని ఏర్పాటు చేయడంతో బస్సు తిరగడానికి స్థలం సరిపోక ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ద్విచక్ర వాహనదారులు ఆ మార్గంలోనే రాంగ్‌రూట్‌లో బస్సులకు ఎదురెళ్లడంతో బస్టాండ్ నుంచి బయటకు వచ్చే బస్సులకు మరింత సమస్యగా మారింది. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలతో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, తహసీల్దార్‌లు

జడ్చర్ల టౌన్: శిక్షణను సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాను సన్నద్ధం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణలో ఆయన పాల్గొని వారికి పలు సూచనలు చేశారు. కొత్త ఓటర్ల నమోదు, డబుల్ ఎంట్రీలు తొలగించడం, దివ్యాంగులను చేర్చడం, ఎస్‌ఆర్‌ఐల సంబంధించిన దరఖాస్తులు పరిష్కారం చేయడంపైనా అవగాహన కల్పించారు. సందేహాలుంటే శిక్షణలోనే తీర్చుకోవాలన్నారు. శిక్షణలో గ్రామాలకు చెందిన 54మంది బీఎల్‌ఓలు పాల్గొన్నారు. మంగళవారం పట్టణంలోని బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు, డీటీ కిషన్, మాస్టర్ ట్రైనీలు సయ్యద్ ఇబ్రహీం, శేషసేనారెడ్డి, శిక్షణ ఇన్‌చార్జి మహమూద్ అలీ పాల్గొన్నారు.

వర్గీకరణతో మాదిగలకు న్యాయం

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏనుగొండలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, వృద్ధులు, వితంతువులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐఐటీ ర్యాంకర్‌కు అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐఐటీ కళాశాలలో జిల్లా కేంద్రానికి చెందిన యాంకి రమేశ్, రమ్యల కూతురు శ్రేష్ఠ సీటు సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, మనోహర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ప్రకారమే ధ్రువపత్రాలివ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ చట్టంలో పేర్కొన్న విధంగా గ్రూప్–1, 2, 3 ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో జెండా ఆవిష్కరణ, మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, కృష్ణయ్య, బాలయ్య, బాలరాజ, రామచందర్, శరత్ చంద్ర, న్యాయవాది చక్రవర్తి, ఆంజనేయులు, కొండయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ముఖద్వారం వద్ద ఎంఎస్ఎఫ్ నాయకులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కార్తిక్, గణేశ్, అధ్యాపకులు మాళవి, మాధురి మోహన్, శైలేశ్, మమత, రూప, ప్రవళి క, పూజిత, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పీయూ ముఖద్వారం వద్ద కేక్‌కట్ చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు రమేశ్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

గండేడ్/మహమ్మదాబాద్: గండేడ్, మహమ్మదాబాద్ మండల కేంద్రాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెండు మండలాల అధ్యక్షులు వెంకట్రాములు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సకల కార్మికులు బుధవారం సామూహికంగా పనులు బంద్ చేసి సమ్మె చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కురుమూర్తి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని కార్మికులందరూ ఉదయం 10గంటలకు మున్సిపల్ టౌన్ హాల్ నుంచి జరిగే ప్రదర్శన, సభల్లో వేలాదిగా పాల్గొనాలని కోరారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గ కేంద్రాల్లో సభలు ర్యాలీలు జరుగనున్నాయని, కార్మికులంతా ఆయా నియోజకవర్గ కేంద్రాలకు చేరాలని పిలుపునిచ్చారు. జీఓ 282ను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సుభాశ్‌చంద్రబోస్ చౌరస్తాలో మున్సిపల్ కార్మికులతో కలిసి జీఓ ప్రతులను దహనం చేశారు.

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో టీయూసీఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, రైస్ మిల్ సంఘం అధ్యక్షుడు దాస్, కార్యదర్శి శేఖర్, కోశాధికారి ఆంజనేయులు, పాల్గొన్నారు.సార్వత్రిక సమ్మెకు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా కన్వీనర్ భానుప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో సోమవారం సీఐటీయూ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ తహసీల్దార్ కార్యాలయం రోడ్, రాయిచూర్ రోడ్, కోయిల్‌సాగర్ రోడ్ మీదుగా బైక్ ర్యాలీ కొనసాగింది. కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్‌లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహులు, వెంకటేశ్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తెగిన ‘తీగ’… తప్పిన ముప్పు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట సోమవారం రాత్రి కరెంటు తీగ తెగిపడిన ఘటనలో పెద్ద ముప్పు తప్పింది. హాస్టల్ ముందున్న 11కేవీ విద్యుత్ తీగ రాత్రిపూట తెగిపోయి హాస్టల్ గేటు ముందు పడింది. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న జీపీ వాటర్‌మెన్ శాంతయ్యకు తీగతగిలే సమయంలో ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. తర్వాత హాస్టల్ విద్యార్థి పేరెంట్ కూడా బయటకు రావడంతో శాంతయ్య వారించాడు. చీకట్లో వాచ్‌మెన్ ఎట్టయ్య కూడా తృటిలో తప్పించుకున్నాడు. హాస్టల్ విద్యార్థులు బయటకు రాకుండా శాంతయ్య, ఎట్టయ్య కాపలా ఉన్నారు. తర్వాత విద్యుత్ సిబ్బంది సురేశ్ అక్కడికి చేరుకుని మరమ్మతు చేపట్టారు.

వయోజనుల విద్యకు ఉల్లాస్

దేవరకద్ర: గ్రామాల్లో వయోజనులకు విద్యను అందించడానికి ప్రభుత్వం ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ కార్యక్రమం అమలు చేస్తున్నదని ఎంఈఓ బలరాం తెలిపారు. సోమవారం దేవరకద్ర జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ హెచ్ఎస్ హెచ్‌ఎంలు నాగేంద్రమ్మ, అబ్దుల్ హక్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆధ్యుడు పండుగ సాయన్న

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బడుగు, బలహీన వర్గాల ఆధ్యుడు పండుగ సాయన్న అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా సోమవారం స్థానిక గ్రీన్‌బెల్ట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పండుగ సాయన్నకు సముచిత గౌరవం లభించిందన్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా వీరన్నపేటకు వచ్చినప్పుడు సాయన్న సమాధిని తొలిసారి సందర్శించి నివాళులర్పించామని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన సమాధిని అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రవి సాగర్, పల్లె రవి, ఆంజనేయులుగౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును విజయవంతం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 15న రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జరిగే విద్యా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అప్‌గ్రేడేషన్ చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా, విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలకు కృతజ్ఞత తెలుపుకుంటూ భారీస్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తెలుగు, హిందీ భాషాపండితులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు త్వరితగతిన ఉద్యోగాలు పొందాలంటే కచ్చితంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీడీసీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం యాజమాన్యం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫణిప్రసాద్, ప్రిన్సిపాల్ కుమారస్వామి, డైరెక్టర్ ఇబ్రహీం ఖలీల్, రాజేశ్వరి, బోస్లేం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డీ అడిక్షన్ సెంటర్‌కు విద్యార్థి

మహబూబ్‌నగర్ క్రైం: కొన్నిరోజుల నుంచి గంజాయికి బానిసైన ఓ విద్యార్థిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. పాలమూరు పట్టణానికి చెందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి గంజాయికి బానిసగా మారాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో స్నేహితుల ద్వారా సరదాగా అలవాటుగా మారిన గంజాయి.. క్రమంగా దానికి బాగా అలవాటుపడి జీవితం గాడితప్పింది. ఈ క్రమంలో పరీక్షలు పూర్తి చేసి కోర్టు అనుమతితో మెడికల్ కళాశాలలోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దేవరకద్రలో కోర్టు కోసం భవనం పరిశీలన

దేవరకద్ర: ఇటీవల దేవరకద్రకు మంజూరైన కోర్టుకు కావాల్సిన భవనం కోసం సోమవారం పాత మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఈ కీర్తి పరిశీలించారు. మంగళవారం జిల్లా జడ్జి వచ్చి భవనం పరిశీలిస్తారని సమాచారం రావడంతో అధికారులు పాత మండల పరిషత్‌కు చేరుకుని గదులను ఆరుబయట ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో ఇక్కడ మండల పరిషత్ కార్యాలయం ఉండగా కొత్త భవనం నిర్మాణం తర్వాత నిరుపయోగంగా మారింది. ఈ మేరకు భవనం పరిశీలనకు జిల్లా జడ్జి వస్తుండడంతో పాత మండల పరిషత్ భవనాన్ని సిద్ధం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. భవనంలో ఉన్న సామగ్రిని తరలించడంతోపాటు పరిశుభ్రంగా మార్చే పనులు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో కోర్టు ఏర్పాటు చేయడం వల్ల అందరికీ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.



పాత మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జీపీ నిధుల దుర్వినియోగంపై చర్యలు చేపట్టాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తుల రిలే నిరాహార దీక్ష



జడ్చర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న పోలేపల్లి గ్రామస్తులు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి జీపీ నిధులకు సంబంధించి సుమారు రూ.1.73 కోట్లను అక్రమంగా దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి వారినుంచి నిధులను రికవరీ చేసి గ్రామాభివృద్ధికి కృషిచేయాలని సామాజిక వేత్త నారాయణచారి డిమాండ్ చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, యువజన, కుల సంఘాల మద్దతుతో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం చేసినట్లు సంబంధిత డీఎల్‌పీఓ విచారణలో వెల్లడైందని, ఈ మేరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌ను సస్పెండ్ చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, ఉపసర్పంచ్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోగా.. నిధులను రికవరీ చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వినోద్, మండలాధ్యక్షుడు యాదయ్య, నాయకులు బాలరాజు, కృష్ణ యాదవ్, శ్రీను, జగన్, దీప్లానాయక్, సుధాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నాగోజీ, రాఘవేందర్, రాములుగౌడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు చేపట్టాలి

జడ్చర్ల: మండంలోని పోలేపల్లి జీపీలో నిధుల దుర్వినియోగం తదితర అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారించిన అధికారులు చర్యలు చేపట్టడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. డీఆర్డీఏ పీడీ, పీఆర్ ఏఈ, ఎంపీడీఓతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ విచారణ చేపట్టి మూడునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నివేదికను సమర్పించకపోవడం విడ్డూరంగా ఉందని, ఇందుకు సంబంధించి కలెక్టర్ విజయేందిరబోయికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. డీపీఎం వెంటనే స్పందించి చర్యలు చేపట్టేలా ఆదేశించాలని కోరారు.

పనిగంటల పెంపు అంగీకరించం



జీపుజాతలో పాల్గొన్న కార్మికులు

జడ్చర్ల టౌన్: పనిగంటలు 8నుంచి 10కి పెంచుతూ మంత్రి వర్గం జీఓ విడుదల చేయడాన్ని అంగీకరించేది లేదని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం నాటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మున్సిపాలిటీలో నిర్వహించిన జీపుజాత కార్యక్రమంలో వారు మాట్లాడారు. 12గంటలు పనిచేయాలని కార్మికులపై రుద్దడానికి మంత్రివర్గం ప్రయత్నిస్తుందని, అదే జరిగితే కార్మికులు ఉదయం 5గంటలకు బయలుదేరి రాత్రి 7గంటలకు ఇంటికి చేరుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు భార్యాబిడ్డలను చూసుకునే సమయం దక్కదన్నారు. మున్సిపాలిటీతోపాటు గంగాపురం, మాచారం, పోలేపల్లి సెజ్ ప్రాంతాల్లో జీపుజాత ప్రచారం చేశారు. కార్యక్రమంలో దీప్లానాయక్, జగన్, కృష్ణ, మహేశ్, విద్యాసాగర్, కిరణ్, నర్సింహులు, అలివేల, యాదమ్మ, ఆశవర్కర్లు సావిత్రి, సుగుణ, దమయంతి, జయమ్మ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

అడ్డాకుల: అధికార కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని ఎండగట్టాలని మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ పిలుపునిచ్చారు. మూసాపేట మండలం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని సోమవారం జానంపేటలో సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధానంపై ముఖ్య నాయకులతో చర్చించారు. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచే విధంగా పనిచేయాలని కోరారు. విభేదాలను పక్కన పెట్టి పార్టీ బీఫారం ఇచ్చిన అభ్యర్థులను గెలిపించుకునే దిశగా అందరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహా, కొండయ్య, రవీందర్‌గౌడ్, గాజులపేట శేఖర్, రవీందర్ రెడ్డి, అనిల్‌రెడ్డి, దాసర్‌పల్లి రాజు, శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

- అదనపు డీఆర్‌డీఓ ముసాయిదా బేగం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

నవాబ్‌పేట: వనమహోత్సవంలో అందరు భాగస్వాములు కావాలని అదనపు డీఆర్‌డీఓ ముసాయిదా బేగం సూచించారు. సోమవారం మండలంలోని దొడ్డిపల్లిలో వననర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమహోత్సవం ప్రతివ్యక్తి బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీ నాటికి మండలంలో అన్ని గ్రామాల్లో వందశాతం టార్గెట్ పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో పెంచిన మొక్కలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేసి నాటించాలన్నారు. ఇండ్లముందు నాటే పూలు, పండ్ల మొక్కలను మహిళలకు పంపిణీ చేసి నాటుకునేలా అవగాహన కల్పించాలని వివరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ నసీర్ ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ధర్నా



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేలకోట్లకుపైగా బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా.. వాటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్, నందు, హేమలత, జ్ఞాపిక, శివ, అజయ్ పాల్గొన్నారు.

నిండు ప్రాణం తీసిన మద్యం మత్తు

- పోల్కంపల్లిలో కారు ఢీకొని మహిళ మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో సోమవారం రాత్రి కారు ఢీకొని మహిళ మృతి చెందగా.. మరో బాలుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో కారులో అతివేగంగా వెళ్తూ పోల్కంపల్లిలో రోడ్డు పక్కనే వెళ్తున్న స్వప్న(24)ను ఢీకొట్టారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో అక్కడే ఉన్న బోల శ్రీశైలం కుమారుడు బోల శివ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కారును నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వేణు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. గాయపడిన బాలుడిని చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. కారులో ఉన్న వారు మద్యం మత్తులో కారును అతి వేగంగా నడపటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో 10న ఎమ్మెల్యే స్టేట్‌మెంట్ రికార్డ్

మహబూబ్‌నగర్ క్రైం: ప్రస్తుతం రాష్ట్రంలో కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఈనెల 10న జూబ్లీహిల్స్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి రావాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు సమాచారం అందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన 6300446873 ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు ఎస్ఐబీ సీడీఆర్ జాబితా ప్రకారం తెలుస్తోంది. ఈ అంశంపై ఈ నెల 10న ఉదయం 11గంటలకు జూబ్లీహిల్స్‌లోని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌లో ఎమ్మెల్యే స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్లు సమాచారం.